



పార్టీ బీఫారం చేతికొచ్చింది లేదు.. ఎన్నికలు మొదలైంది లేదు.. అందులో పోటీ చేసింది లేదు.. గెలిచింది లేదు.. పార్టీ అధికారంలోకి వచ్చిందీ లేదు.. అప్పుడే పోస్టుల పందేరం పెట్టాడు ఓ వైసీపీ నాయకుడు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతిస్తే ఆలయ కమిటీ చైర్మన్‌గా అవకాశమిస్తాననీ, వైసీపీకి చెందిన ఓ నియోజకవర్గ స్థాయి నాయకుడు.. పార్టీ మద్దతుదారుడికి అభయమిచ్చినట్లు సమాచారం. ఆ మద్దతుదారుడు ప్రస్తుతం ఓ నామినేటెడ్ పదవిలో కొనసాగుతున్నాడు. ఆ నియోజకవర్గ స్థాయి నాయకుడితో వ్యాపార సంబంధాలున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ నాయకుడికి ఖర్చుల కోసం మద్దతుదారుడు రూ.మూడు కోట్లు అప్పజెప్పినట్లు చర్చ సాగుతోంది. ఇందుకు ప్రతిగా ఆలయ చైర్మన్ పదవి ఇప్పిస్తానని అభయమిచ్చినట్లు తెలిసింది. - కదిరి

అమ్మకానికి ఆలయ చైర్మన్ సీటు!



ఎన్నికల్లో నాకు మద్దతిస్తే..

నీవే చైర్మన్..


మద్దతుదారుడికి ఓ నాయకుడి అభయం

నజరానాగా రూ.మూడు కోట్లు?

కదిరి పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకవర్గం గడువు ఫిబ్రవరిలో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్ పదవి కట్టబెడతానని చెప్పడంతో ఆ మద్దతుదారుడు కొన్నిరోజులుగా అన్నీ తానై నియోజకవర్గ నాయకుడి ఖర్చులు భరిస్తూ ముందుకు నడిపిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల్లో ఇంకా అభ్యర్థి ఎవరన్నది తేలకనే తన అవసరాల కోసం ఆ నాయకుడు వాడుకుంటున్నట్లు తెలిసింది. ఆ నాయకుడు.. మరింత మందికి పదవుల ఆశ చూపి, డబ్బు వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన వద్ద ఉన్న డబ్బంతా అధిష్ఠానానికి కప్పం కట్టడానికే సరిపోయిందనీ, ఎవరైనా సాయం చేస్తేనే ఎన్నికల్లో పోటీ చేయగలనని ఆ నాయకుడు.. మద్దతుదారుల వద్ద ప్రాధేయపడినట్లు సమాచారం. ఆ నాయకుడి చుట్టూ మరికొంతమంది చేరి, తమ మద్దతు కావాలంటే తమకే డబ్బులివ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు తాము పార్టీ కోసం భారీగా ఖర్చు పెట్టామనీ, అదంతా ఇస్తే ఎన్నికల్లో తాము మద్దతిస్తామని షరతు పెట్టినట్లు చర్చ సాగుతోంది. ఈ సంకట పరిస్థితిలో ఆ నాయకుడు పదవుల పందేరం పెట్టినట్లు సమాచారం.

• నజరానాగా రూ.మూడు కోట్లు?

వైసీపీలోని ఓ నాయకుడు తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాననీ, ప్రస్తుతం తనకు సాయం చేయాలనీ, ఇప్పటికే నామినేటెడ్ పదవిలో ఉన్న పార్టీ మద్దతుదారుడిని కోరినట్లు తెలిసింది. ఇదే తడవుగా ఆ నాయకుడు రూ.మూడుకోట్ల వరకు ఇచ్చినట్లు సమాచారం. అందుకు ప్రతిగా ఆలయ చైర్మన్ పదవి తనకివ్వావాలని కోరినట్లు సమాచారం. తప్పకుండా ఇస్తాననీ, అధిష్ఠానం తన మాట వింటుందని అభయమిచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ మద్దతుదారుడు అన్నీతానై వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఖర్చులతోపాటు పార్టీ వ్యవహరాలు చూసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పుతో అలజడి కొనసాగుతోంది. దీనిని గుర్తించిన ఆ మద్దతుదారుడు తానే కాబోయే ఆలయ కమిటీ చైర్మన్ అని అందరి వద్ద చెప్పుకుంటున్నట్లు సమాచారం. గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా తాను కొంతమంది కౌన్సిలర్లకు ఖర్చు పెట్టాననీ, ఈసారి కూడా అదే పంథాలో పనిచేసి, గెలిపిస్తానని చెప్పుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. డబ్బు తీసుకున్న నాయకుడు కూడా గెలిచేది తానేననీ, పార్టీలో తన మాట చెల్లుబాటవుతోందనీ, ఎదురేలేదని చెప్పుకుంటున్నట్లు పట్టణ వాసులు గుసగుసలాడుతున్నారు. ఆ ధైర్యంతోనే డబ్బు తీసుకున్న నాయకుడు నజరానాగా చైర్మన్ పదవి ఆశ చూపినట్లు తెలుస్తోంది.



ఫిబ్రవరి 20తో ముగియనున్న పదవీకాలం

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి పదవీకాలం గడువు ఫిబ్రవరి 20వ తేదీతో ముగియనుంది. ఈనేపథ్యంలో ఆలయ చైర్మన్ పదవి కోసం పలువురు ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. అందులో భాగంగానే నామినేటెడ్ పదవిలో ఉన్న ఓ మద్దతుదారుడు ఆ నాయకుడికి కప్పం కట్టి, అభయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత పాలకవర్గ పదవీకాలాన్ని పొడిగించే అవకాశం లేకపోలేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో ఆలయ పాలకమండలిని కొత్తగా నామినేట్ చేసే అవకాశం ఉంటుందా, లేదా అన్నది అప్పటి పరిస్థితులు నిర్ణయించాల్సిందే. నామినేట్ చేయాల్సి వస్తే.. ఉన్న పాలకమండలి గడువులోపే ఎన్నికలు పూర్తయి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు కొనసాగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ చైర్మన్ పదవి ఎరగా చూపి, రూ.మూడుకోట్లు దండుకోవడం ఎంతవరకు సమంజసమని వైసీపీ నాయకులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.







మాట్లాడుతున్న మంత్రి ఉష శ్రీచరణ్

అన్నదమ్ముల ద్వారా రాజకీయాలు

చేయను..

ఎమ్మెల్యే శంక్‌నారాయణపై మంత్రి ఉష పరోక్ష విమర్శలు

గోరంట్ల, జనవరి 10: పెనుకొండ వైసీపీలో విభేదాలు బయట పడ్డాయి. మండలంలోని గుమ్మయ్యగారిపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో వైసీపీ నియోజకవర్గ నూతన ఇన్‌చార్జి, మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. అన్నదమ్ముల ద్వారా తాను రాజకీయాలు చేయనంటూ అధికార పార్టీకే చెందిన స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నారాయణపై పరోక్ష విమర్శలు గుప్పించారు. తనకు అన్నదమ్ములు కూడా ఎవరూ లేరంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారం రేపాయి. ఎమ్మెల్యే శంకర్‌నారాయణ తన సోదరుల ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రాజకీయాలు చేస్తున్నారనీ, అందినకాడికి దోచుకుంటున్నారని ప్రతిపక్షాలతోపాటు స్వపక్ష నాయకులు కూడా ఆది నుంచీ బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉషశ్రీ వ్యాఖ్యలు.. ఎమ్మెల్యేను ఉద్దేశించి చేసిన పరోక్ష విమర్శలేనన్నది నిర్వివాదాంశం.

అంటీముట్టనట్లుగా ఎమ్మెల్యే అనుచరులు

కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉషశ్రీని వైసీపీ అధిష్ఠానం ఎన్నికల వేళ మార్పులు, చేర్పుల్లో భాగంగా పెనుకొండ ఇన్‌చార్జిగా నియమించింది. పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణను కాదని ఉషశ్రీని నియమించడంపై ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామాలు చేస్తామంటూ అధిష్ఠానానికి హెచ్చరికలు సైతం పంపారు. ఈ నేపథ్యంలో ఆయన అనుచరులు.. మంత్రి సమావేశంలో అంటీముట్టనట్లుగా ఉన్నారు. వారంతా కలిసికట్టుగా ఒకేచోట కూర్చున్నారు. వేదికపైకి వచ్చి మాట్లాడాలని కోరినా ఎమ్మెల్యే అనుచరులు రాకపోవడం గమనార్హం.

వైసీపీ పాలనలో

బీసీలకు అన్యాయం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి.. జయహో బీసీ ప్రచార రథం ప్రారంభం



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న బీకే పార్థసారథి

పెనుకొండ, జనవరి 10: వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు అన్నిరంగాల్లో అన్యాయం చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య అధ్యక్షతన నియోజకవర్గంలో జయహో బీసీ కార్యక్రమ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీకే పార్థసారథి మాట్లాడుతూ.. బడుగుబలహీనవర్గాలకు అండగా నిలబడింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. మొట్టమొదటిసారిగా బీసీలకు రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత ఎన్టీరామారావుదేనన్నారు. అనంతరం రిజర్వేషన్‌లు తెచ్చి పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. బీసీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమేతప్ప.. నిధులిచ్చింది లేదని మండిపడ్డారు. కార్పొరేషన్లను నీరుగార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి, రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జయహో బీసీ రథయాత్ర ద్వారా రోజూ రెండు మండలాల్లో పర్యటిస్తూ టీడీపీ హయాంలో బీసీలకు చేకూరిన మేలు.. వైసీపీ పాలనలో వాటిల్లిన నష్టాన్ని వివరిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల సంక్షేమానికి చేపట్టబోయే కార్యక్రమాలను వివరించి, అందరినీ ఏకతాటిపైకి తెచ్చి పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అనంతరం జయహో బీసీ ప్రచార రథాలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మడకశిర ఇన్‌చార్జి గుండుమల తిప్పేస్వామి, పరిశీలకుడు నరసింహ యాదవ్, కురుబ సాధికారత కన్వీనర్ గంగులకుంట రమణ, కుమ్మర శాలివాహన కన్వీనర్ పోతులయ్య, వక్కళిగ కన్వీనర్ పాండురంగప్ప, ఈడిగ సాధికార కమిటీ కన్వీనర్ గిరిధర్ గౌడ్ పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం

తథ్యం

ఎమ్మెల్యే బాలకృష్ణ ధీమా

వైసీపీ పాలన అంతా కేసులు, దాడులమయమని విమర్శ

హిందూపురం, జనవరి 10: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో వార్డులవారీగా సమీక్ష బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమాలపై నిలదీస్తే కేసులు పెట్టడం, ప్రశ్నిస్తే దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి చేసింది శూన్యమనీ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దోచుకోవడానికే సమయం సరిపోయిందని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ఎక్కడైనా గుర్తుండిపోయే పనేదైనా చేశారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నాయి తప్ప.. ఈ ఐదేళ్లలో ఏం చేశారో వారే చెప్పాలన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు దౌర్జన్యంగా భూములు లాక్కున్నారన్నారు. ఆలయ భూములను సైతం వదల్లేదని విమర్శించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆ పార్టీలో ఏం జరుగుతోందో అందరూ చూస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమనీ, మరో రెండు నెలలు ఆగాలని శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలన్నారు. 2వేలమందికిపైగా ఒక్కొక్కరితో ఫోటో దిగారు.

చిన్నారులు, దివ్యాంగులతో ఆప్యాయంగా..

సమీక్ష సందర్భంగా చిన్నారులు, దివ్యాంగులు.. బాలయ్యను కలిశారు. వారిని ఆప్యాయంగా మాట్లాడుతూ.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సంఘాల నాయకులు.. ఎమ్మెల్యేను సత్కరించారు.



మోకాళ్లపై కూర్చుని దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ఉద్యోగులను తొక్కుకుంటూ పాలన



భూతప్ప తరహాలో సమగ్రశిక్ష ఉద్యోగులను తొక్కుకుంటూ వెళ్తున్న దృశ్యం

భూతప్ప తరహాలో సమగ్రశిక్ష ఉద్యోగి నిరసన

22వ రోజుకు చేరిన సమ్మె

పుట్టపర్తి రూరల్, జనవరి 10: ఉద్యోగులను తొక్కుకుంటూ ప్రభుత్వం పాలన సాగిస్తోందని సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దుయ్యబట్టారు. సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 22వ రోజుకు చేరుకుంది. పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వినూత్న నిరసన తెలిపారు. పలువురు ఉద్యోగులు బోర్లా పడుకోగా.. ఓ ఉద్యోగి సీఎం జగన్, మంత్రి బొత్స సత్యనారాయణ ఫొటోలు మెడలో వేలాడేసుకుని భూతప్ప తరహాలో చేతిలో వేపమండలు పట్టుకుని, వారిని తొక్కుకుంటూ వెళ్లాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. నిరసన దీక్ష చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగుల పట్ల వైసీపీ ప్రభుత్వతీరు దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని పల్లె హామీ ఇచ్చారు. మూడురోజుల క్రితం అనకాపల్లిలో ధర్నాలో పాల్గొని, మానసిక ఒత్తిడి అధికమై గుండెపోటుతో మరణించిన వాసుదేవరావు కుటుంబానికి పల్లె రూ.పదివేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు అబ్దుల్, ఉద్యోగ జేఏసీ నేత ఓబిరెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



బతుకమ్మా.. జగన్‌కు

మంచి బుద్ధి ఇవ్వమ్మా..

వినూత్న రీతిలో అంగన్‌వాడీల నిరసన

30వ రోజుకు చేరిన సమ్మె

పుట్టపర్తిరూరల్, జనవరి 10: 'అమ్మా.. బతుకమ్మా.. జగన్‌రెడ్డికి మంచి బుద్ధి ఇవ్వమ్మా..' అంటూ బతుకమ్మ ఆడుతూ అంగన్‌వాడీలు వినూత్న నిరసన చేపట్టారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం ముందు గుడిబండ, మడకశిర, పెనుకొండ సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీలు వినూత్నంగా బోనాలతో బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఆడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దిల్షాద్ మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం వైసీపీ ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదన్నారు. జిల్లాలో ముదిగుబ్బ, నంబులపూలకుంట, కదిరి, ఓబుళదేవరచెరువు, నల్లమాడ, హిందూపురం, ధర్మవరం, బత్తలపల్లి, లేపాక్షి, చిలమత్తూరులో అంగన్‌వాడీల నిరసనల హోరు కొనసాగింది.



సమ్మెకు పల్లె మద్దతు

పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేశాడని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నా కనీసం వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయకపోవడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీలు 30రోజులుగా రోడ్లపైకి వచ్చి సమ్మె చేస్తుంటే.. వారిపై ఎస్మా ప్రయోగిస్తానని బెదిరించడం ఎక్కడి న్యాయం అని ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాల్సిందేనన్నారు.

అంగన్‌వాడీలకు

నోటీసులు



ఉద్యోగాల్లోంచి ఎందుకు తొలగించకూడదో చెప్పాలట..!

హిందూపురం అర్బన్, జనవరి 10: అంగన్‌వాడీలపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. అంగన్‌వాడీలను ఎందుకు తొలగించకూడదో చెప్పాలంటూ మహిళ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ నుంచి ఐసీడీఎస్ కార్యాలయాలకు నోటీసులు అందాయి. ఆ మేరకు సీడీపీఓలు, సూపర్‌వైజర్లు.. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు అందించాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం నోటీసులు అతికించాలి. సోమవారం హిందూపురంలోని శాంతినగర్‌కు చెందిన ఒకరు, రూరల్ మండలంలో ముగ్గురు కార్యకర్తలు, ముగ్గురు సహాయకులు విధుల్లో చేరినట్లు సమాచారం. కొందరు వైసీపీ సానుభూతిపరులు.. తమకు తెలిసిన వారు, బంధువులను భయపెట్టి విధుల్లో చేరేలా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీలకు 60:40 నిష్పత్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు అందిస్తున్నాయనీ, అలాంటపుడు రాష్ట్ర ప్రభుత్వం విధుల నుంచి ఎలా తొలగిస్తుందని యూనియన్ నాయకులు నిలదీస్తున్నారు. హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 330 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అర్బన్‌లో 85, రూరల్‌లో 245 కేంద్రాలు నడుస్తున్నాయి. ఇప్పటి వరకు పట్టణ పరిధిలో ఒక్క షోకాజ్ నోటీసు కూడా కేంద్రాలకు అతికించలేదు. చాలావరకు సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు ఏ సెంటర్ ఎక్కడుందో తెలియకపోవడంతో నోటీసులు అందజేయడంలో జాప్యమవుతున్నట్లు కార్యాలయ సిబ్బందే చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నోటీసుల జారీ అంగన్‌వాడీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బీసీల ద్రోహి జగన్

టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ



సమావేశంలో టీడీపీ నాయకులు

బుక్కపట్నం, జనవరి 10: బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయకుండా నమ్మక ద్రోహం చేసిన వ్యక్తి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బీసీల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచింది టీడీపీనే అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఏర్పాటు చేసి, బడుగులకు రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేసిందని వివరించారు. వైసీపీ పాలనలో నిధులు విడుదల చేయకుండా కార్పొరేషన్‌ను నీరుగార్చి బీసీలను అన్నివిధాలుగా అణగదొక్కారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఏకతాటిపై వచ్చి టీడీపీని గెలపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బాలు, తెలుగు మహిళ అధ్యక్షురాలు లావణ్యగౌడ్, టీడీపీ బీసీసెల్ నాయకులు గోర్లక్రిష్ణ, రామక్రిష్ణ, ఈశ్వరయ్య, మంజునాథ్, శ్రీరాములు, చెన్నప్ప పాల్గొన్నారు.

చిత్తశుద్ధిలేని ప్రభుత్వం: తెలుగు యువత



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న తెలుగుయువత నాయకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 10: ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని తెలుగుయువత నాయకులు అన్నారు. రాష్ట్రంలో యువత పక్కదారి పడుతున్నా, ఏమాత్రం పట్టించుకోకపోవడంతో దారుణమన్నారు. బుధవారం నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి యువత పెడదారి పట్టకుండా ప్రభుత్వం, పోలీసులు చర్య తీసుకోవాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే 2.30లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతియేటా జనవరి 1న జాబ్‌క్యాలెండర్ అని ప్రగల్భాలు పలికిన జగన్ నిరుద్యోగులు చేసింది శూన్యమన్నారు. యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి పెడదారి పడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి అంబులెన్స్ రమేష్, బళ్లారి సుధాకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు వైవి. మురళీ, సుధీర్, ప్రధాన కార్యదర్శి మనోహర్, మధుసూదన్‌రెడ్డి, నరేష్, నల్లమాడ శివప్రసాద్‌రెడ్డి, రామాంజనేయులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, గిరినాథ్‌రెడ్డి, ఆటో రామాంజి ఉన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



పరామర్శిస్తున్న తెలుగుయువత నాయకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 10: అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు నిజాంను బుధవారం తెలుగుయువత నాయకులు పరామర్శించారు. పరామర్శించినవారిలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబుళరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి అంబులెన్స్ రమేష్, వైవి. మురళీ, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, నరేష్, శివప్రతాప్‌రెడ్డి, ఆటో రామాంజనేయులు, టీడీపీ ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, గిరినాథ్‌రెడ్డి తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు



అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించిన దృశ్యం

ఓబుళదేవరచెరువు, జనవరి 10: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఐసీడీఎస్ సిబ్బంది ఉద్యోగ నియమ నిబంధన ఉల్లంఘన, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి సంబంధించిన సంజాయిషీ నోటీసును బుధవారం అంటికించారు. 30రోజులుగా సిబ్బంది సమ్మెలో ఉండడంతో ప్రభుత్వం ఎస్మాతో పాటు జీవోనెంబర్ 2నువిడుదల చేసిన విషయం తెలిసిందే. ఓడీసీ ప్రాజెక్టు పరిధిలోని అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మూడు మండలాల్లో 249 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటికించే ప్రక్రియను ప్రారంభించారు. కార్యకర్తలు, ఆయాలు నోటీసులు తీసుకోకపోవడంతో సీడీపీఓ, సూపర్‌వైజర్లు కేంద్రాలకెళ్లి నోటీసులు అంటికించాల్సి వస్తోంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, ప్రధాన కార్యదర్శి రంగమ్మ, మణిమాల మాట్లాడుతూ... తమ న్యాయమైన కోరికలు ప్రభుత్వం నేరవేర్చకుండా సమ్మెను నీరుగార్చేందుకు ఎస్మా ఉపయోగించిందని, నోటీసులు అంటిస్తున్నారని, ఏం చేసినా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించమని హెచ్చరించారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

బత్తలపల్లి, జనవరి 10: మండల కేంద్రంలో అంగన్‌వాడీల నిరసన కొనసాగింది. బుధవారం నోటీసులు జారీచేస్తామనడంతో అంగన్‌వాడీలు సీడీపీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సీడీపీఓ సరస్వతి లేకపోవడంతో కార్యాలయం ముందు బైఠాయించారు. సీడీపీఓ 2 గంటలకు కార్యాలయానికి వచ్చారు. విధుల్లో చేరకుంటే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. సమస్యలు తీరే వరకు విధుల్లో చేరమని అంగన్‌వాడీలు తెగేసి చెప్పారు. దీంతో వైసీపీ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి అంగన్‌వాడీల వద్దకు వెళ్లి విధుల్లోకి చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తారని, విధుల్లోకి తక్షణమే చేరాలని చెప్పడంతో వారు విధుల్లోకి చేరుతున్నట్టు అంగీకారపత్రాలు ఇచ్చారు.

వీధికుక్కల దాడిలో 90 గొర్రెపిల్లల మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రె పిల్లలు

అమడగూరు, జనవరి 10: కుక్కలదాడిలో 90 గొర్రెపిల్లలు మృతిచెందడంలో కాపరులు కన్నీరుమున్నీరయ్యాయి. బుధవారం రాత్రి మండలంలోని మహమ్మదాబాద్ గ్రామసమీపంలో గొర్రెలను మేతకు కాపర్లు తీసుకెళ్లారు. గొర్రెపిల్లలను పొలంలో కంచే వేసి వదిలి వెళ్లారు. ఇంటి కొచ్చే సమయంలో వీధి కుక్కలన్ని చేరి గొర్రెపిల్లలపై దాడి చేసి దాదాపు 90గొర్రెపిల్లలను చంపివేశాయి. బాధితుల తెలిపిన వివరాల మేరకు ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి గ్రామానికి చెందిన శివయ్య, పోతులయ్య, రవి, నారాయణస్వాములకు చెందిన గొర్రెలను అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్‌లో రైతుల పొలాలల్లో ఎరువుల కోసం రాత్రి సమయంలో బస చేయిస్తున్నారు. ఎకరాకు రూ.7వేల చొప్పున ఒప్పందం కుదుర్చుకుని తోలారు. కుక్కలదాడిలో గొర్రెపిల్లలు మృతిచెందడంతో రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటరెడ్డి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశువైద్యాధికారి హరినాథ్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది ఘటనాస్థలానికెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కాపరులు కోరారు.

చండీగఢ్ వాసిపై కేసు నమోదు

తనకల్లు, జనవరి 10: తమిళనాడు వాసి ఫిర్యాదు మేరకు చండీగఢ్ రాష్ట్రానికి చెందిన పునీతనందపై తనకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండలం కొండవెనుకపల్లి పరిధిలో తనకు పొలాలున్నాయంటూ పునీతనంద.. తమిళనాడుకు చెందిన శివప్రసాద్‌ను నమ్మించాడు. అందులో కలర్ బిల్డ్ పేరుతో రైతులకు సాయం చేయడానికి ఓ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నానని చెప్పాడు. అందులో ఎకరానికి రూ.18.74 లక్షలు పెట్టుబడి పెడితే ప్రతినెలా రూ.9,375 చొప్పున పదేళ్లపాటు చెల్లిస్తానని నమ్మబలికాడు. దీంతో శివప్రసాద్ రూ.18.74 లక్షలు ముట్టజెప్పాడు. ఆ మేరకు శివప్రసాద్‌కు రూ.లక్ష వరకు పునీతనంద చెల్లించాడు. ఆరు నెలలుగా డబ్బు చెల్లించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి, పునీతనంద కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పునీతనంద ఇదే తరహా కేసులో చండీగఢ్ సబ్ జైలులో ఉన్నట్లు తెలుస్తోంది.

రైతుల ఆశలు ఆవిరేనా?

అసైన్డ్ భూములపై గుట్టు విప్పని రెవెన్యూ అధికారులు



రైతులు సాగుచేసిన ప్రభుత్వ భూమి

గాండ్లపెంట, జనవరి 10: ప్రభుత్వ భూమి సాగుచేస్తున్న ప్రతి రైతులకు పట్టాలివ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం. అయితే రెండేళ్లగా రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుండడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలవ్యాప్తంగా 168 మంది లబ్ధిదారులకు 2, 068 ఎకరాలను గుర్తించినట్లు అప్పటి గ్రామసభల్లో తెలిపారు. భూమిలేని పేద రైతుకు ప్రభుత్వ భూములు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. అలాంటి రైతులకు భూపట్టాలివ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం. పది సంవత్సరాలనుంచి పలువురు రైతులు కొండలు, గుట్టలు, వాగులు, వంకలలో చెట్లు, రాళ్ల తొలగించుకుని సాగుచేసుకుంటున్నారు. వారిని గుర్తించి వెంటనే పట్టాలు ఇస్తామని రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం తెలిపింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న రైతులను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకుని, భూముల కొలతలు వేసి సర్వే నెంబర్లను గుర్తించారు. అనంతరం రైతులతో గ్రామసభలు ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇంతవరకు రైతుల జాబితాను ప్రకటించలేదు. పలుమార్లు తహసీల్దార్‌ను లబ్ధిదారులు అడిగితే, కలెక్టర్లకు వివరాలు పంపామని, ఆమోదం పొందినతరువాత జాబితా ప్రకటిస్తామని చెబుతున్నారు. రైతులు ఎప్పుడు తమ భూములకు పట్టాలిస్తారో తెలియన పరిస్థితిగా మారింది. ఎంపిక చేసిన రైతుల వివరాలు అందివ్వకపోవడంతో బడారైతులు జాబితాలో ఉన్నారన్న అన్న సందేహం వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో అసైన్డ్ భూపంపిణీ జరుగుతుందా..? అన్న అనుమానాలు తలెత్తున్నాయి. ఏదిఏమైనా సాగులో ఉన్న రైతులకు కలెక్టర్ చొరవచూపి వెంటనే పట్టాలందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా అసైన్డ్ భూముల వివరాలు

ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలిస్తామన్నారు. రెండు సంవత్సరాలుగా రైతులకు సాగుపట్టాలివ్వలేదు. ప్రభుత్వ భూమి సాగుచేస్తున్న రైతుల వివరాలు, భూ కొలతలు, హద్దులు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఎవరు అర్హులో..? ఏ పంచాయతీలో ఎంతమందికి పట్టాలు ఇస్తారో..? తెలియని పరిస్థితిగా మారింది. పలుమార్లు తహసీల్దార్‌ను అడిగినా ఎంపిక చేసిన రైతుల వివరాలను వెల్లడించలేదు గుట్టుచప్పుడుకాకుండా బడా నేతలకు ప్రభుత్వ భూమిని పంచే పనిలో ఉన్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

అర్హులకే పట్టాలివ్వాలి: ఆనంద్, బీజేపీ మండల కన్వీనర్

అసైన్డ్ భూ పంపిణీ అర్హులైన వారికే పట్టాలివ్వాలని బీజేపీ మండల కన్వీనర్ ఆనంద్ తహసీల్దార్‌ను కోరారు. పలుమార్లు రైతులు కార్యాలయానికి వెళ్లి వివరాలను అడుగుతున్నా గోప్యంగా ఉంచుతున్నారని, దీంతో బడా నేతలకు అసైన్డ్ భూములు అందించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో అర్హులకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోంది..

అంగన్‌వాడీల ఆగ్రహం



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ధర్మవరం, జనవరి 10: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 30వ రోజుకు చేరింది. ఈ దీక్షలకు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్ష,కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, రైతుసంఘం మండల అధ్యక్షుడు కొత్తపేట మారుతి, సీపీఐ నాయకులు పోలా లక్ష్మీనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించేంతవరకు ఆందోళనను విరమించే ప్రసక్తే లేదన్నారు.

ముదిగుబ్బ: అంగన్‌వాడీల సమ్మె బుధవారం కొనసాగింది. 30 నమూనా ఆకారంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని, గ్రాట్యుటీ రూ.5 లక్షలు అమలు పరచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్‌చేశారు. నిరసనలు చేస్తుంటే వాటిని అణచివేసే ధోరణికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

ఓబుళదేవరచెరువు: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 30వరోజు బుధవారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సీడీపీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షులు ఆశీర్వాదమ్మ, రంగమ్మ, మణిమాల, కార్యకర్తలు, ఆయాలున్నారు.

నల్లమాడ: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్మా జీవోను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలున్నారు.

కదిరిఅర్బన్: ప్రభుత్వం ఎన్ని జీవోలు తెచ్చినా సమ్మె ఆగదని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. ఎస్మాను రద్దు చేయాలని, షోకాజు నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సీఐటీయూ నాయకులున్నారు.

గడ్డితింటూ అర్ధనగ్నంగా పారిశుధ్య కార్మికుల నిరసన



ఓబుళదేవరచెరువులో గడ్డితింటూ పారిశుధ్య కార్మికుల నిరసన

ఓబుళదేవరచెరువు, జనవరి 10: తమకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా పారిశుధ్య, పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం ముందు పారిశుధ్య కార్మికులు అర్ధనగ్నంగా గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ శ్రీరాములు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 8 నెలలుగా, పంచాయతీ కార్మికులకు 13 నెలలుగా వేతనాలు రాకపోవడంతో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదన్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలపడం జరుగుతోందన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కుళ్లాయప్ప, పారిశుధ్య కార్మిక సంఘం అంజనప్ప తదితరులున్నారు.

కదిరిఅర్బన్: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. తమ డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని వారు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికుల సమ్మెకు సీపీఐ నియోజకవర్గకార్యదర్శి మధు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని తదితర డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుందా, కార్మికులు దుర్గమ్మ, నర్సక్క, నారాయణస్వామి, మారుతి, ముకుంద, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షుడు అద్రామహేశ్, ప్రధానకార్యదర్శి బొగ్గునాగరాజు, సహాయకార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరిసురేశ్, అంకే పెద్దన్న, పరమేశ్, యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కళ్లు మూసుకుందంటూ కార్మికులు వినూత్న నిరసనకు దిగారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమ కష్టాలు ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి సమాన పనికిసమాన వేతనం, ఉద్యోగభద్రత కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లుతెరచి కార్మికుల సమస్యలు చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ లక్ష్మీనారాయణ, గంగాధర్, పారిశుధ్యం, ఇంజనీరింగ్, పుడా కార్మికులు రమణ, రమేష్, గణేష్, నాగభూషణ, నాగార్జున, రామయ్య, పెద్దన్న, గోవిందు, నరసింహులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్‌మీట్

పుట్టపర్తి, జనవరి 10: శ్రీసత్యసాయి విద్యాసంస్థల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ గురువారం హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇందు కోసం విద్యార్థులు ప్రత్యేక రిహార్సల్స్ చేపట్టారు. స్పోర్ట్స్‌మీట్ నిర్వహించడానికి స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గురువారం ఉదయం 8గంటలకు స్పోర్ట్స్‌మీట్ ప్రారంభంకానుంది. సత్యసాయి యూనివర్సిటీ పరిధిలోని ప్రశాంతినిలయం, బెంగుళూరులోని బృందావన్, కర్ణాటకలోని ముద్దెనహళ్లి, అనంతపురంలోని మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొననున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 12వతేదీనుంచి 15వరకు ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చిన్నారులను అప్పగించిన పోలీసులు

తనకల్లు, జనవరి 10: ముగ్గురు చిన్నారులు 15 కిలోమీటర్లు రైల్వేలైన్ ద్వారా నడుచుకుంటూ సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని రైల్వేస్టేషన్‌కు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. తనకల్లు పోలీసులు తెలిపిన వివరాల మేరకు అన్నమయ్య జిల్లా ములకలచెరువు సమీపంలోని దారులూలాం ఇస్లామిక్ అరబిక్ మదరాసాలో ఆర్ రియాం, అబ్దుల్లా, హమాన్ విద్యాభ్యాసం చేస్తున్నారు. వారు బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం వారు రైల్వేలైన్ ద్వారా తనకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ప్రయాణికులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందజేశారు. వారు హుటాహుటిన రైల్వేస్టేషన్‌కు వచ్చి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మదరాసా నిర్వాహకుడికి సమాచారం అందజేశారు. ఆయన పోలీసుస్టేషన్‌కు రాగానే వీఆర్ఓ నజీర్ ఆధ్వర్యంలో చిన్నారులను నిర్వాహకుడికి అప్పగించారు. చిన్నారులపట్ల జాగ్రత్త తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ సూచించారు.

ఓటమిభయంతోనే విమర్శలు

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



మాట్లాడుతున్న చిలకం

ధర్మవరం, జనవరి 10: ఓటమి భయంతోనే పవన్‌కల్యాణ్‌పై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శలు చేస్తున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని జనసేన రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల కమిషన్‌ను కలిసి రాష్ట్రంలో ఒకే డోర్‌నెంబరుపై పదులసంఖ్యలో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు ఎక్కిస్తున్నారని వీటిని తొలగించాలని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. పారదర్శకంగా ఎన్నికలు జరపాలని కోరారన్నారు. ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించిందన్నారు. అయితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికల కమిషన్‌ను కలవడం వైసీపీ నాయకులకు మింగుడుపడలేదన్నారు. జనసేనపార్టీకి గుర్తింపు లేదని విజయసాయిరెడ్డి పేర్కొనడం సిగ్గుచేటన్నారు. దొంగల, కబ్జా కోరుల పార్టీ వైసీపీ అని మండిపడ్డారు. క్రికెటర్ అంబటిరాయుడు పట్టుమని పది రోజులుకూడా వైసీపీలో ఉండలేక రాజీనామా చేశారని, దీనిబట్టి చూస్తే సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఘోరపరాజయం కావడం తథ్యమన్నారు.

పల్లె పరామర్శ

పుట్టపర్తి, జనవరి 10: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కప్పలబండ మాజీ సర్పంచ్ గోపాల్‌మూర్తి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లాకేంద్రంలోని ఎనుములపల్లి ఎస్సీకాలనీలో రెండురోజులక్రితం వివాహిత అనిత ఆర్థిక ఇబ్బందువల్ల ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆయన ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయనతోపాటు ఉమాపతియాదవ్, గంగాధర్, పోతులయ్య, మధురాయల్, నాయకులు, కార్యకర్తలున్నారు.

కాలిపోయిన 33 కేవీ విద్యుత్ లైన్ కేబుల్

నిలిచిన విద్యుత్ సరఫరా



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొత్తచెరువు, జనవరి 10: పుట్టపర్తి సబ్‌స్టేషన్ నుంచి కొత్తచెరువు మండలానికి సరఫరా అయ్యే 33కేవీ విద్యుత్ కేబుల్ రైల్వేటర్నల్ వద్ద బుధవారం కాలిపోయింది. దీంతో కొత్తచెరువు మండలానికి విద్యుత్‌సరఫరా నిలిచిపోయిందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ కేబుల్ వైరు మరమతులు చేపట్టడం జరిగిందన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరమతులు కానిపక్షంలో ధర్మవరం నుంచి గృహాలకు విద్యుత్ సరఫరా అందిస్తామని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడికి సన్మానం



సుధాకర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జనవరి 10: టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్‌ను బుధవారం పలువురు సన్మానించారు. మాజీ కౌన్సిలర్లు శీలామూర్తి, మాధనమహేశ్వరి, నాయకులు మాధనసుబ్బయ్య, అత్తర్ రహీం, మున్నీ, బిల్లేశీన, స్వర్ణకుమారి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పరిశే సుధాకర్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా టీడీపీ గెలుపుకోసం పనిచేద్దామన్నారు. అదేవిధంగా పరిటాలశ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలపించుకునే బాధ్యత కూడా మనపై ఉందన్నారు.

బాలకృష్ణను కలిసిన నాయకులు

ఓబుళదేవరచెరువు, జనవరి 10: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ బుధవారం బీసీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి జెరిపిటి అంజనప్ప, సీనియర్ నాయకులు గాజుకుంపల్లి అంజన్‌రెడ్డి కలిశారు. టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వెళ్లి వివరించాలని బాలకృష్ణ తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను బలంగా తీసుకువెళ్లాలని సూచించారన్నారు. రానున్న ఎన్నిల్లో పార్టీ గెలుపునకు కృషి చేసి, ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేయాలని వివరించారన్నారు.

పుట్టపర్తి: జిల్లాలో వైసీపీ నాయకుల అవినీతిని ఎండగట్టాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించినట్లు తెలుగుయువత రాష్ట్రనిర్వహణ కార్యదర్శి అంబులెన్స్ రమేష్ తెలిపారు. హిందూరంలో బుధవారం బాలకృష్ణను కలిసి సన్మానించడం జరిగిందన్నారు. టీడీపీ విజయం కోసం కష్టపడి పనిచేయాలని, వైసీపీ అవినీతి ఎండగట్టాలని బాలకృష్ణ సూచించినట్లు రమేష్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఓబుళదేవరచెరువు, జనవరి 10: కర్ణాటక నుంచి అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న తిప్పనను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. సమాచారం మేరకు సున్నంపల్లి రోడ్డు వద్ద తిప్పన్న ఎటువంటి అనుమతులు లేకుండా 96 టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటింగ్‌పై అవగాహన

నంబులపూలకుంట, జనవరి 10: ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవడంపై ఆర్డీవో వంశీకృష్ణ అవగాహన కల్పించారు. మండలంలోని ధనియాన్‌చెరువు గ్రామంలో బుధవారం ప్రజలకు ఓటి ంగ్‌పై ప్రయోగాత్మకంగా వివరించారు. ఏలా ఓటు వినియోగించుకోవాలన్న విషయాన్ని తెలిపారు. అనంతరం 192, 193. 194 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్, వికలాంగ ఓటర్లకు ర్యాప్ ఏర్పాట్లుపై తహసీల్దార్ నరేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రోడ్డు మార్గంలేని పోలింగ్ కేంద్రాలన్నాయా..? అని అడుగగా, అన్ని కేంద్రాలకు రోడ్డు ఉన్నాయని తహసీల్దార్ వివరించారు. ఆయనతోపాటు రెవెన్యూ, అధికారులు, బీఎల్ఓలు, ఓటర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో సీనియర్ జట్టు విజయం

కదిరిఅర్బన్, జనవరి 10: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో క్రికెట్ ఫర్ యునిట్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన పోటీల్లో కదిరి సీనియర్ జట్టు విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన సీనియర్ జట్టునిర్ణీత 15ఓవర్లలో 103 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కోచింగ్ క్యాంపు జట్టు 95 పరుగులకు ఆలౌట్ అయ్యింది. విజయం సాధించిన సీనియర్ జట్టును క్రీడకారులు అభినందించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

కదిరిఅర్బన్, జనవరి 10: వరకట్న వేధింపులపై బాధితురాలు వల్లెపు మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బుధవారం రూరల్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లికి చెందిన మాధవి తన భర్త భార్గవ్‌కుమార్, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు ఫిర్యాదు పేర్కొంది. కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కదిరిఅర్బన్, జనవరి 10: మండలపరిధిలోని ఎర్రదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం రూరల్ సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పేకాటస్థావరాలపై దాడి చేశారు. గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,960తో పాటు రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమాచారం అడిగినా ఇవ్వరు..

పుట్టపర్తి, జనవరి 10: సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సమాచారం ఇవ్వాల్సి ఉండగా, అధికారులు మాత్రం స్పందించలేదని బాధితులు చింతాదామోదర్, శివారెడ్డి, గిరిధర్‌రావు వాపోయారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 24న ఎనుములపల్లి సర్వేనెంబర్ 11లో తహసీల్దార్‌ను సమాచారం అడిగామని, అదేరోజు జిల్లారిజిష్టర్‌ను సమాచారం అడుగగా నెలరోజులు దాటినా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదన్నారు. 30రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా, 45రోజులు దాటినా సమాచారం ఇవ్వలేదని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదుచేస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జేసీ పవన్‌రెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీడీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ పవన్‌కుమార్ రెడ్డి

అనంతపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీడీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ పవన్ కుమార్ రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం జేసీ పవన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో... తొలిసారిగా పవన్‌రెడ్డి కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అరగంటపాటు సీఎంతో రాజకీయాలపై చర్చించినట్లు పవన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో... ఏపీకి సంబంధించి నీటివాటా సమస్యలు, వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అసమర్థ పాలనతో దగాపడిన నిరుద్యోగ యువతకు తెలంగాణలో ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు. మరీ ముఖ్యంగా రాయలసీమ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నాలుగేళ్లుగా ఆగిన పింఛన్!

- మంజూరు చేయాలని ఓ వృద్ధురాలి వేడుకోలు


పింఛన్ ఇవ్వాలని వేడుకుంటున్న లింగమ్మ

చెన్నేకొత్తపల్లి, జనవరి 10: తనకు నాలుగేళ్లగా వృద్ధాప్య పింఛన్ రావడం లేదని, మంజూరు చేయించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని ఒంటికొండ గ్రామానికి చెందిన ఏడు పదుల వయస్సు దాటిని లింగమ్మ వేడుకుంటోంది. ఆమె కొన్నేళ్లుగా పింఛన్ తీసుకుంటోంది. అయితే నాలుగేళ్ల క్రితం ఉన్నఫలంగా పింఛన్‌ను నిలిపేశారు. ఎలాంటి ఆసరా లేక ఒంటరిగా జీవిస్తున్న ఆ వృద్ధురాలి జీవనం దినం ఓ యుగంలా నెట్టుకొస్తోంది. వయస్సు పైబడటంతో కూలి పనికి వెళ్లలేని స్థితిలో ఉన్నానని, పింఛన్ కోసం అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై వెంకటంపల్లి సచివాలయ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఒకే రేషన్ కార్డులో అత్తా, కోడలు ఉండేవారని, కోడలికి వితంతు పింఛన్ వస్తుండటంతో అప్పట్లో లింగమ్మకు పింఛన్ తొలిగించార ని తెలిపారు. దీంతో తాము రేషన్‌కార్డులో నుంచి ఆ వృద్ధురాలి వేరు చేసి ఆధా ర్ కార్డుకు మొబైల్ లింకుతో పాటు బయోమెట్రిక్ చేయించామని, పింఛన్‌కు సంబంధించి అర్హుల జాబితాలో ఉందని, త్వరలో పింఛన్ వస్తుందని తెలిపారు.

ఫారం-7కు ఎక్కువగా దరఖాస్తు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జనవరి 10: మండలంలోని 149, 150 పాలచెర్ల, బొగినేపల్లి పోలింగ్ కేంద్రాల్లో స్థానిక వైసీపీ నాయకులు ఫారం-7కు 5 కంటే ఎక్కువగా దరఖాస్తు చేశారని, రెవెన్యూ అధికారులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి రమేష్ తహీల్దార్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ఒక వ్యక్తి ఫారం-7కు కేవలం 5 మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. అంతకంటే ఎక్కువ చేసిన వారికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొగినేపల్లిలో వైసీపీ నాయకులు ఓబిరెడ్డి ఫారం-7కు 22, రామకృష్ణ 18, భాస్కర్‌రెడ్డి 28, కుర్లపల్లయ్య 9, పాలచెర్లలో గంగిరెడ్డి 30 దరఖాస్తులు చేశారన్నారు. వీరిపై గ్రామంలో విచారణ చేపట్టాలన్నారు. బీఎల్‌ఓ, రెవెన్యూ అధికారులు ఆ పని చేయలేదని విమర్శించారు. ఆయా గ్రామాల్లో పని చేస్తున్న బీఎల్‌ఓ కూడా వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నాడని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని పక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిని తనిఖీ చేసిన సీఎండీ

గుంతకల్లు, జనవరి 10: స్థానిక రైల్వే ఆసుపత్రిని చీఫ్ మెడికల్ డైరెక్టరు (సీఎండీ) సీకే వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిని సందర్శించిన సీఎండీ ఐసీయూ పక్కన నిర్మించిన లిఫ్టును ప్రారంభించారు. ఆసుపత్రిలో వైద్య సదుపాయాల తీరు, వైద్య పోస్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులను తనిఖీ చేశారు. రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు సీఎండీని కలిసి పలు అంశాలపై చర్చించారు. రైల్వే డివిజన్ కేంద్రంలోని ఆసుపత్రిలో ఏడు నర్సింగ్ పోస్టులు, ఫార్మసిస్టు, డాక్టరు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్, రమేశ్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవ్

- జేఎన్‌టీయూ, ఎస్కేయూ యాజమాన్యాల హెచ్చరిక


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం సెంట్రల్, జనవరి 10: ఫీజులు కట్టాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని జేఎన్‌టీయూ, ఎస్కేయూ యాజమాన్యాలు.. కళాశాలలను హెచ్చరించాయి. ఈ మేరకు బుధవారం ఆయా యాజమాన్యాలు వేరు వేరుగా ప్రకటనలు విడుదలచేశాయి. కన్వీనర్ కోటాలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు విద్యాదీవెన సొమ్ము చెల్లించడంలేదని, దీంతో సొంతంగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదనను బుధవారం ఆంధ్రజ్యోతిలో 'చేతులెత్తేసిన జగన్!' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన జేఎన్‌టీయూ, ఎస్కేయూ యాజమాన్యాలు... ప్రభుత్వాన్ని వెనుకేసుకువచ్చే ప్రయత్నంచేశాయి. ప్రతి త్రైమాసికానికి ఒకసారి క్రమం తప్పకుండా ప్రభుత్వం నిధులు విడుదలచేస్తుందని చెప్పుకొచ్చాయి. అయితే బీటెక్ మూడో సెమిస్టర్ పూర్తికావస్తున్నా ఒక త్రైమాసికం మాత్రమే నిధులు విడుదలచేసి రెండు త్రైమాసికాల నిధులను నేటికీ విడుదుల కాలేదు. వసతి దీవెన రూ.20వేలకు గాను రూ.10వేలిచ్చి చేతులెత్తేశారు. ఈ అంశాలపై వర్సిటీల యాజమాన్యాలు ఎందుకు స్పందించడం లేదని బాధిత విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ఆకలి కేకలు!

- వసతి గృహాల్లో బువ్వ కష్టాలు..
- మూడు నెలలుగా పెండింగ్‌లో డైట్ బిల్లులు
- సరిపడ బడ్జెట్ కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం
- ఉన్న బడ్జెట్‌ను ఎవరికి సర్దాలో తెలియని పరిస్థితుల్లో అధికారులు
- ఇదీ జిల్లాలో సంక్షేమ వసతిగృహాల దుస్థితి


బీసీ సంక్షేమశాఖ కార్యాలయం


ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల కార్యాలయ సముదాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 10: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు బువ్వ కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి నిధులు రాకపోవడంతో డైట్‌ను అమలు చేయలేని పరిస్థితుల్లో ఆయా వసతిగృహాల వార్డెన్‌లు ఉన్నారు. నెల నెలా కేటాయించాల్సిన డైట్ బిల్లులు ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్లగా మూడు నెలలకోసారి... ఐదు నెలలకోసారి విడుదల చేస్తుండటంతో అటు అధికారులు... ఇటు వార్డెన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ మూడు నెలలకోసారి విడుదల చేసినా అదికూడా కేవలం ఒక్క నెలకు సంబంధించిన బిల్లులు విడుదల చేస్తుండటంతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలకు సంబంధించి మూడు నెలలకు సంబంధించిన డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని డివిజన్లలో అయితే ఏకంగా నాలుగు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పేద విద్యార్థులకు అరకొర భోజనం అందుతోందన్న విమర్శలు లేకపోలేదు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అందించాల్సిన డైట్ బిల్లుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో వారు కడుపునిండా అన్నం తినే పరిస్థితి లేదు.

బడ్జెట్ కేటాయించని ప్రభుత్వం

బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలకు సంబంధించి డైట్ బిల్లులు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అరకొర బడ్జెట్‌లు కేటాయించి ఎటూకాకుండా చేసిందన్న విమర్శలు ఆయా శాఖల వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఎస్సీ సంక్షేమ శాఖలో ఇప్పటి వరకూ దాదాపు రూ.3 కోట్లకుపైగానే బడ్జెట్ ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆ బడ్జెట్‌ను రిలీజ్ చేయాలంటే 58 హాస్టళ్లకు మూడు నెలలకు సరిపడా సరిపోవడం లేదని పేర్కొంటున్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమశాఖలో సైతం ఇదే బడ్జెట్ సమస్య వినిపిస్తోంది. కొద్దిపాటి బడ్జెట్‌ను ఏ డివిజన్‌కు ఇవ్వాలో తెలియక ఆ శాఖ అధికారులు తికమకపడుతున్నారనే చెప్పాలి. ఇలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విషయంలోనూ సరిపడ నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు ఆయాశాఖ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

బడ్జెట్ కొద్దిగానే ఉంది...



మూడు నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. బిల్లులకు సంబంధించి తమ వద్ద బడ్జెట్ కొద్దిగానే ఉంది. మిగిలిన బడ్జెట్ పైస్థాయి నుంచి విడుదలవ్వాల్సి ఉంది. ఆ మేరకు ఏమైనా బడ్జెట్ వస్తే.. అన్ని డివిజన్లకు కేటాయిస్తాం.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

బడ్జెట్ వస్తే.. బిల్లులిస్తాం..



డైట్ బిల్లులకు సంబంధించి మావద్ద 3వ విడత బడ్జెట్ మాత్రమే ఉంది. 4వ విడతకు సంబంధించి బడ్జెట్ రావాల్సి ఉంది. ఆ బడ్జెట్ కేటాయిస్తే మొత్తం మూడు నెలలకు సంబంధించిన బిల్లులు విడుదల చేస్తాం. కొన్నిచోట్ల నాలుగు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని రిలీజ్ చేసే అవకాశం ఉంది. పైస్థాయి అధికారులను సంప్రదించాం. త్వరలోనే బడ్జెట్ వచ్చే అవకాశముంది.

-మధుసూదన్‌రావు, జేడీ, ఎస్సీ సంక్షేమశాఖ

మూడు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్

జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా... 7329 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీటన్నింటికీ అక్టోబరు నుంచి డైట్ బిల్లులు అందాల్సిన ఉంది. మరికొన్ని డివిజన్లలో అయితే సాంకేతిక సమస్యలతో నాలుగైదు నెలల నుంచి బిల్లులు రావాల్సి ఉంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ వసతిగృహాలకు సంబంధించి దాదాపు రూ.5 కోట్లకుపైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అదే విధంగా ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాలకు సంబంధించి జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 4927 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టళ్లకు సంబంధించి సగానికిపైగా నాలుగునెలల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దాదాపు రూ.5 కోట్ల వరకూ బిల్లులు అందాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఎస్టీ, మైనార్టీ సంక్షేమశఖ వసతిగృహాలకు సంబంధించి రూ.కోటికిపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక జనవరి నెల కలిపితే మరో నెల బిల్లులు పెండింగ్‌లో పడితే ఏం చేయాలోనన్న ఆందోళనలో వార్డెన్లు పడిపోయారు. దీనికిన్నా ముందు ఎన్నికల సమయం కావడంతో ఆలస్యమైతే ఇక మళ్లీ వచ్చే విద్యాసంవత్సరం వరకూ వేచి ఉండాల్సి వస్తుందేమోనన్న ఆందోళన చెందుతున్నారు.

ఆకలితో 'ఆడుదాం ఆంధ్ర'


భోజనం లేకపోవడంతో నీరసంగా కూర్చున్న క్రీడాకారులు

శింగనమల, జనవరి 10: రాష్ట్రంలో జగగన్న ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప... క్రీడాకారులకు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదు. భోజనం వసతి కల్పించకపోవడంతో కొందరు క్రీడాకారులు ఆకలితోనే ఆటలు ఆడారు. బుధవారం శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహించారు. మండలంలో నుంచి 13 సచివాలయల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు ఉదయం శింగనమలకు చేరుకున్నారు. అయితే ఉదయం అల్పాహారం... మధ్యాహ్నం భోజనం సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు క్రీడాకారులు హోటల్లో తన సొంత డబ్బులతో భోజనం చేయగా.. మరికొందరు ఆకలి బాధ భరిస్తూనే ఆటలు ఆడారు. అధికారులు మాత్రం సచివాలయ సిబ్బందికి, అక్కడికి వచ్చిన పీఈటీలకు మాత్రమే భోజనం పెట్టి చేతులు దులుపుకున్నారు.


సొంత ఖర్చులతో హోటల్లో భోజనం చేస్తున్న క్రీడాకారులు

రహదారి మూసేసి.. సభావేదిక

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ప్రజాప్రతినిధుల తీరుతో విసిగిపోతున్న ప్రజలు


ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సభావేదిక

లేపాక్షి, జనవరి 10: అధికార ప్రభుత్వంలో విద్యుత్‌శాఖ మంత్రిగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం లేపాక్షిలో పర్యటించారు. ఆయన రాకకు సభావేదికను లేపాక్షి ప్రధాన రహదారుల్లో సిద్ధం చేశారు. ఎప్పుడో సాయంత్రం 5గంటలకు నిర్వహించే సభ కోసం మంగళవారం రాత్రి నుంచే రహదారిని మూసివేశారు. ప్రధాన రహదారికి సభావేదిక అడ్డుగా వేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో చిలమత్తూరు వైపు నుంచి లేపాక్షి మీదుగా హిందూపురానికి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులతో వెళ్లే బస్సులు బైపాస్ మీదుగా వెళ్లడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు. రహదారిలో సభావేదిక ఏర్పాటు చేయడంతో వ్యాపారులు లబోదిబోమన్నారు. సభావేదిక రహదారిలో కాకుండా ఏదైనా ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అడ్డుచెప్పలేక వత్తాసు పలుకుతుండటంపై ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేశారు. ఓ మంత్రి రాకకోసం 24గంటలు రహదారిని మూసివేయడం ఎంత వరకు సబబమని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్


జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత నాయకులు

పెనుకొండ టౌన్, జనవరి 10: ప్రతి ఏటా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇప్పటి వరకు యువతను ఏ ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా నట్టేట ముంచిన ఘనుడు సీఎం జగన్ అని తెలుగు యువత నాయకులు మండిపడ్డారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికార పార్టీ వైసీపీ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పోలీసులకు తెలుగు యువత నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో నిరుద్యోగులకు మోసం చేశారన్నారు. టీడీపీ హయాంలో రెండుసార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈ వైసీపీ పాలనలో ఒక డీఎస్సీ నోటిఫికేషనైనా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక గత నాలుగు నెలలుగా 21,570మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. జాబ్ రావాలంటే బాబురావాలనే నినాదంతో వైసీపీని భూస్థాపితం చేస్తామన్నారు. పలువురు తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు


గాయపడిన ధనుష్, చికిత్స పొందుతున్న గౌతమి

గోరంట్ల, జనవరి 10: మండలంలోని కాగానిపల్లిలో పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పక్కగ్రామమైన చిన్న నారప్పపల్లి వైపునుంచి ఓ పిచ్చికుక్క గ్రామంలోకి బుధవారం సాయంత్రం ప్రవేశించి సురేష్ అనే వ్యక్తి కుడికాలిపై కరిచింది. అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్తూ బూరుగు నాగప్ప ఇంటిముందు అతడి భార్య గంగులమ్మ 18 నెలల మనవడు ధనుష్‌ను ఆడించుకుంటుండగా, బాబుపై పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. బాలుడిని వెంటనే రక్షించే ప్రయత్నం చేసిన గంగులమ్మను పిచ్చికుక్క తల, ముఖం, ఎడమచేతిపై తీవ్రంగా గాయపరిచింది. అక్కడే ఉన్న మరో మనవరాలు గౌతమి కుడికాలిపై కరవడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. చుట్టుపక్కలవారు గుమిగూడి పిచ్చి కుక్కను చంపివేసినట్లు చెప్పారు. గాయపడిన వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించి, మెరుగైన చికిత్సకోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

15లోగా ఈ క్రాపింగ్ పూర్తి చేయండి

అనంతపురం అర్బన్, జనవరి 10: జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ క్రాపింగ్‌ను 15వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. బుధవారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం కిసాన్ ఈకేవైసీని నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల నిరసన


గుత్తిలో బీపీసీఎల్ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ట్యాంకర్ డ్రైవర్లు

గుత్తి, జనవరి 10: పట్టణ శివారులోని బీపీసీఎల్ డిపో ఎదుట ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు బుధవారం నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సహితీ 106-2 హిట్ అండ్ రన్ చట్టం డ్రైవర్లకు శాపంగా మారిందని, ఆ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల వాహనాలు రోడ్డు ఎక్కాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏ డ్రైవర్‌కు ఉద్దేశపూర్వకంగా ప్రమాదాలు చేయాలనే ఆలోచన ఉండదన్నారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష విధించేలా చట్టం తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 14వ తేదీ వరకు స్టీరింగ్ డౌన్ పేరిట వాహనాలు నడపకుండా నిరసన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ట్యాంకర డ్రైవర్ల యూనియన్ నాయకులు రామకృష్ణ, శంకరయ్య, అన్వర్, నారాయణ, షఫీ పాల్గొన్నారు.

సీమకు జగన్ చేసిందేమీ లేదు

- బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్


ప్రసంగిస్తున్న రామచంద్రయాదవ్

అనంతపురం రూరల్, జనవరి 10: కంత్రీ ముఖ్యమంత్రి జగన్ రాయలసీమకు చేసిందేమీ లేదని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ విమర్శించారు. స్థానిక రుద్రంపేట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన రాయలసీమ గర్జన సభలో ఆయన ప్రసంగించారు. రాయలసీమకు గొప్ప చరిత్ర ఉందని, నీతి, నిజాయితీ, పౌరుషానికి రాయలసీమ పెట్టింది పేరని అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి అత్యధిక ముఖ్యమంత్రులను అదించింది రాయలసీమ అని అన్నారు. అలాంటి రాయలసీమను ఎవరూ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అన్నారు. దేశంలో అత్యంత ఎక్కువ వలసలున్న ప్రాంతం రాయలసీమ అని అన్నారు. 2019లో తప్పుడు హామీలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులు, గనులు, సహజవనరులను లూటీ చేసిందని ఆరోపించారు. నీటి ప్రాజెక్టుల పేరిట వైఎస్ జగన్ రూ.37వేల కోట్లు దండుకున్నారని, రాష్ట్రంలో ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని మండిపడ్డారు. వైఎస్ జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనలో కడపలో సర్వానాయుడు ప్రాజెక్టును పూర్తి చేశారని, అదికూడా రైతులకు, ప్రజలకు నీరు ఇచ్చేందుకు కాదని అన్నారు. కేవలం తన మేనమామ చేపల చెరువుల కోసం, తన సంస్థ భారతి సిమెంట్ కోసం పూర్తి చేశారని ఆరోపించారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో వేల ఎకరాలు పోగేసుకుంటున్నారని ఆరోపించారు. కడపలో ఉక్కు పరిశ్రమకు రెండుసార్లు శంకుస్థాన చేసినా, పనులు ప్రారంభించలేకపోవడం జగన్‌మోహన్‌రెడ్డి చేతగాని తనమేనన్నారు.

జడ్పీ సీఈఓగా వైఖోమ్ నైదియా దేవి

- 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారి
- అనంతలోనే తొలి పోస్టింగ్



అనంతపురం విద్య, జనవరి 10: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ కొత్త సీఈఓగా రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారిని నియమించింది. 2021 బ్యాచ్‌కు చెందిన వైఖోమ్ నైదియా దేవిని జడ్పీ నూతన సీఈఓగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఆమె 2016 నుంచి ఐదుసార్లు సివిల్స్ ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. 2020లో యూపీఎస్‌సీ పరీక్షల్లో 180వ ర్యాంకు సాధించారు. 2021 బ్యాచ్‌కు చెందిన ఆమె శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అనంతపురం జడ్పీ సీఈఓగా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఈఓ భాస్కర్ రెడ్డి సస్పెండ్ అయ్యారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ గతేడాది ఆగస్టు 23 నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. కొత్త సీఈఓ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు జడ్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

జడ్పీలో ఐఏఎస్‌ల ప్రస్థానం ఇదీ...

గతంలో జిల్లా పరిషత్‌కు జిల్లా అభివృద్ధి అధికారు (డీడీఓ)లు ఉండేవారు. 1981 నుంచి 1994 వరకూ జడ్పీకి జిల్లా అభివృద్ధి అధికారులు(డీడీఓ) పనిచేశారు. తర్వాత సీఈఓలు వచ్చారు. జడ్పీలో ఐఏఎస్‌ల ప్రస్థానం చూస్తే... కేఆర్ వినాయక్ 1981 వరకు, బీ రామారావు 1982-84 మధ్య, జేసీ మెహంతి 1984లో, బీ అరవింద్ రెడ్డి 1993లో పనిచేశారు. 1994 తర్వాత జడ్పీకి ముఖ్యకార్యనిర్వహణాధికారులు(సీఈఓలు) రాగా ఐఏఎస్ అధికారులైన శశిభూషణ్ కుమార్ 2003-04 వరకు, బి. విజయేందిరా 2013-14 మధ్య పనిచేశారు. తాజాగా కేతన్ గార్గ్ గత ఏడాది ఆగస్టు 23 నుంచి ఇప్పటి వరకూ సీఈఓగా వ్యహరిస్తున్నారు. ఇప్పటి వరకూ ఏడుగురు ఐఏఎస్‌లు జడ్పీకి బాస్‌లుగా వ్యవహరించారు. కొత్తగా నియమితురాలైన వైఖోమ్ నైదియా దేవి విధుల్లో చేరితే 8వ ఐఏఎస్ అధికారి కానున్నారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే తెలపండి

సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మడకశిరటౌన్, జనవరి 10: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ సూచించారు. ఆయన బుధవారంమడకశిర తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... ఫారం-6, ఫారం-7 ఫారం-8 తోపాటు వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. ఒకే డోర్‌నెంబర్‌పై నమోదైన ఓటర్లను తొలగించాలని, ఒక్క మడకశిర నగర పంచాయతీ పరిధిలోనే ఒకే డోర్‌నెంబర్‌పై 28 ఓట్లు నమోదయ్యాయని తెలుగుదేశం పార్టీ నాయకులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని తొలగించాలని వారు కోరగా ఒకే డోర్ నెంబర్‌పై నమోదైన ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీఇచ్చినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో మూడు పోలింగ్ స్టేషన్లను మార్పు చేయాలని కోరగా పరిశీలిస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారన్నారు. ఓటరు జాబితాపై ఎలాంటి సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సబ్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మారుతీప్రసాద్, టీడీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులనే పంపిణీ చేయండి: సబ్ కలెక్టర్



సరుకుల నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న డీటీ బాలాంజనేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, జనవరి 10 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సరుకుల్లో నాణ్యమైన వాటినే పంపిణీ చేయాలని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'కుళ్లిన గుడ్లు.... పురుగు పట్టిన చిక్కీలు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి సబ్ కలెక్టర్ స్పందించారు. ఆయనే స్వయంగా మడకశిర న్యూ ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి మంగళవారం సరుకులు తీసుకెళ్లిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులను పరిశీలించి బాగా ఉన్నవాటినే పంపిణీచేయాలని డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు,సీడీపీఓ నాగమల్లేశ్వరిని ఆదేశించి వెళ్లారు. అనంతరం వారు చెడిపోయిన వాటిని తొలగించి మంచి సరుకును లబ్ధిదారులకు పంపిణీచేశారు.

ఆర్టీసీ టికెట్ డిప్ విజేతలు వీరే

పెనుకొండ, జనవరి 10: ఆర్టీసీ వారు ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన టికెట్ డిప్ విజేతలుగా ముగ్గురు ప్రయాణికులు ఎంపికైనట్లు డిపో ఇన్‌చార్జ్ రామాంజనేయులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో బుధవారం డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో పెనుకొండ డిపోకు చెందిన రెండు బస్సుల్లోని డిప్ బాక్సుల్లో టికెట్లను డిప్ వేశారు. ఇందులో పెనుకొండకు చెందిన శంషాద్, మేకలపల్లికి చెం దిన రామచంద్ర, మడకశిర డిపోకు చెందిన డిప్‌బాక్సుల్లో మడకశిరకు చెందిన రాధాకృష్ణకు డిప్ తగిలినట్లు ఆయన తెలిపారు. విజేతలకు రూ.వెయ్యి విలువచేసే కుక్కర్లను బహుమతి అందజేస్తున్నట్లు డీఎం తెలిపారు.

చిల్లర దుకాణంలో చోరీ

గోరంట్ల, జనవరి 10: పట్టణంలోని ఓ రెస్టారెంట్ పక్కన ఉన్న చిల్లర దుకాణంలో మంగళవారం రాత్రి రూ.40వేలు విలువ చేసే వస్తువులు చోరీ అయినట్లు బాధితుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రతాప్ రెడ్డి చిల్లర దుకాణంతోపాటు పాలడెయిరీ, టీదుకాణాన్ని ఒక బంక్‌లో నిర్వహిస్తున్నాడు. బంకుకున్న రేకులను గునంతో తొలగించి లోపలున్న సిగరెట్ బండల్స్ ఆయిల్ ప్యాకెట్లు, క్యాష్ బాక్స్‌లోని నగదు ఎత్తుకెళ్లారని వాపోయాడు. యేడాది క్రితం ఇదే దుకాణంలో చోరీ జరిగిందని తెలిపాడు. కాగా నెలరోజుల కిందట ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న జంబీర్ బంకులో సిగరెట్లు తదితర వస్తువులు చోరీ జరిగిందన్నాడు. చోరీ విషయం పోలీసులకు తెలిపినట్లు తెలిపాడు.

రేషన్ బియ్యం పట్టివేత

గోరంట్ల, జనవరి 10: మండలంలోని కోరేవాండ్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద కర్ణాటకకు తరలి వెళ్తున్న 246 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం ప్రకారం దాడి చేసి ఏపీ39 టీ డీ 4395 నంబర్‌గల ఐషర్ వాహనంలో 246 బస్తాల్లో తరలిస్తున్న 12టన్నుల 190 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లికి చెందిన ఐషర్ డ్రైవర్ బోయ చంద్రను అరెస్టు చేసి, పట్టుబడిన బియ్యాన్ని గోరంట్ల సివిల్ సప్లైస్ గోడౌన్‌లో భద్రపరిచారు. నల్లమాడ మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన క్రిష్ణ అనే వ్యక్తి ధర్మవరంలో నివాసముంటూ తాను సేకరించిన రేషన్ బియాన్ని సొంత వ్యాన్‌లో కర్ణాటకకు తరలిస్తూ లబ్ధిపొందేవాడని విజిలెన్స్ అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, డ్రైవర్‌తో పాటు ఐషర్ వాహనాన్ని గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో అప్ప గించామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ జైపాల్‌రెడ్డి, ఏఈ కుళ్లాయప్ప, ఆర్‌ఐ సోమశేఖర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మారెన్న, కానిస్టేబుల్ ముక్కన్న పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా చెట్లు

ఇబ్బందుల్లో వాహనదారులు



వడ్డెబెట్ట అటవీప్రాంతంలో రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లు

గుడిబండ, జనవరి 10 : మండలంలోని బూచర్లపల్లి, వడ్డెబెట్ట గ గ్రామాల మధ్యలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు అడ్డంగా పెరగడంతో మలుపుల వద్ద ఎదురు వచ్చే వాహనాలు కానరాకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుడా రోడ్డుపై రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు.. వాటిలో ఏ వాహనం కూడా పక్కకు వెళ్లేందుకు లేకుండా చెట్లు అడ్డుగా వస్తున్నాయని వాపోతున్నారు. దీంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రచ్చకెక్కిన వైసీపీ

- రెండు వర్గాలుగా విడిపోయి రగడ
- పెత్తనమంతా ఆయనదేనా..?
- ఆ వర్గానికి వత్తాసు పలుకుతున్న ముఖ్యనేత
- పార్టీ వీడేందుకైనా సిద్ధమంటున్న ఓవర్గం
- దూతలు వచ్చినా వినని వైనం
- రోజంతా అసమ్మతి నాయకులతో సమావేశాలు



చిలమత్తూరులో సమావేశమైన వైసీపీ అసమ్మతి నాయకులు

హిందూపురం, జనవరి 10: చిలమత్తూరు మండలంలో అధికార పార్టీలో విభేదాలు రగులుతున్నాయి. మంగళవారం రాత్రి హిందూపురంలోని వైసీపీ కార్యాలయంలో రెండువర్గాల నాయకులు బాహీబాహీకి దిగిన విషయం తెలిసిందే. ఒక వర్గానికి చెందిన నాయకులను మంత్రి దూతలు కలిశారు. అయినా ససేమిరా అంటూ హిందూపురం నుంచి వెళ్లిపోయారు. బుధవారం చిలమత్తూరు ఎంపీపీ వ్యతిరేక వర్గీయులంతా సమావేశమయ్యారు. రోజంతా సమాలోచనలు చేశారు. భవిష్యత్తు ప్రణాళికలపై మాట్లాడుకున్నారు.

ఆది నుంచీ ఇక్కడ వర్గపోరే..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిలమత్తూరు మండలంలో వర్గపోరు సాగుతూనే ఉంది. ఇటీవల అది తారస్థాయికి చేరింది. 2019 ఎన్నికల అనంతరం ప్రస్తుత ఎంపీపీ.. ఎమ్మెల్సీ ఇక్బాల్ వెంటే ఉన్నారు. స్థానిక ఎన్నికలకు ముందు ఆయన ఎమ్మెల్సీకి దూరమయ్యారు. అయినా ఎంపీటీసీగా గెలిచి అనూహ్య పరిణామాల మధ్య ఎంపీపీ పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఎంపీపీ పదవికి సంబంధించి ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకు ఏడాదిన్నర తరువాత వేరే వ్యక్తికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. రెండేళ్లు దాటినా ఉలుకూపలుకూ లేదు. దీంతో ఎలాగైనా ఎంపీపీని పదవి నుంచి తప్పించి, ఒప్పందం ప్రకారం చెప్పిన వ్యక్తికి ఇవ్వాలని మరో వర్గం నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తుత ఎంపీపీకి ఎమ్మెల్సీ ఇక్బాల్ చెప్పడంతో ఆయన దూరమయ్యాడు.

పెత్తనమంతా ఆయనదే..

హిందూపురం నూతన సమన్వయకర్తగా దీపికను నియమించాక చిలమత్తూరు మండలంలో పెత్తనమంతా ఆ ప్రజాప్రతినిధికే అప్పగించారన్న వాదనలున్నాయి. దీంతో ఎంపీపీ వ్యతిరేక వర్గీయులకు కార్యాలయాల్లో ఏ పని జరగకుండా సమన్వయకర్త సహకారంతో సదరు ప్రజాప్రతినిధి అడ్డు పడుతున్నట్లు ఆ పార్టీ నాయకులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. సదరు ప్రజాప్రతినిధి అధికారం అడ్డం పెట్టుకొని వ్యతిరేక వర్గీయులకు అనుకూలంగా ఉన్న వలంటీర్లు, భోజన ఏజెన్సీలు, ఎఫ్‌సీ షాపుల మార్పుతోపాటు కొన్ని నామినేటెడ్ పోస్టులు వారికి దక్కకుండా మోకాలడ్డుతున్నట్లు సమాచారం. ఇదేవిషయాన్ని ముఖ్యనేతల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదంటూ అసమ్మతి వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆ వర్గానికే ముఖ్యనేత వత్తాసు

హిందూపురానికి నూతన సమన్వయకర్త వచ్చినప్పటి నుంచి చిలమత్తూరు మండలంలో ఒక నాయకునికే పెత్తనమంతా అప్పగించారు. దీంతో మొన్నటివరకు సమన్వయర్త వెంట ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసమ్మతి వర్గంలో చేరారు. దీంతో వారికి ఏ పని కావాలన్నా సమన్వయకర్త వర్గం అడ్డు పడుతున్నట్లు తెలిసింది. సదరు మండల ప్రజాప్రతినిధికి నియోజకవర్గ సమన్వయకర్త అండ ఉండటంతో అసమ్మతి నాయకులు ఏమీ చేయలేకపోతున్నారు. మండల ప్రజాప్రతినిధి వర్గంతో పోలిస్తే అసమ్మతి నాయకుల వర్గానికే ఎక్కువ బలం ఉంది. ముఖ్యనేత.. ప్రజాప్రతినిధికే పెత్తనం అప్పగించడంతో రోజురోజుకీ మండలంలో అసమ్మతి వర్గం పెరుగుతోంది.

పార్టీ వీడేందుకైనా సిద్ధం

మంగళవారం రాత్రి పార్టీ కార్యాలయంలో తలెత్తిన పరిణామాల నేపథ్యంలో సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి చిలమత్తూరు మండల నాయకులపై చిర్రుబుర్రులాడారు. అక్కడున్న మండల ప్రజాప్రతినిధే.. అసమ్మతి నాయకులపై దాడికి ప్రయత్నించి దుర్భాషలాడినట్లు తెలిసింది. అయినా సదరు ముఖ్యనేత.. ఒకవర్గం నాయకులను టార్గెట్ చేస్తూ మాట్లాడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బలమైన అసమ్మతి వర్గం నాయకులు చిలమత్తూరులోని ఓ నాయకుడి ఇంట్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సమన్వయకర్తలో మార్పు రాకపోతే తమ దారి తమదేనంటూ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మంత్రి దూతలు చిలమత్తూరు వెళ్లి వైసీపీ నాయకులు నాగరాజు యాదవ్, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, మండల మాజీ కన్వీనర్ రాజారెడ్డి, శంకరప్ప, నరసింహారెడ్డి, శంకరరెడ్డి, శీనా, జానార్దన్ రెడ్డి తదితరలతో సమావేశమయ్యారు. మండలంలో సమాన ప్రాధాన్యం ఇవ్వకపోతే పార్టీ వీడేందుకైనా సిద్ధం అంటూ ఎంపీపీ వ్యతిరేక వర్గీయులు మంత్రి దూతలకు గట్టిగా చెప్పినట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం హిందూపురం చేరుకుని, ఇక్కడ సమన్వయకర్తకు వ్యతిరేకంగా ఉన్న వర్గీయులను కలిసి బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వర్గపోరు తారస్థాయికి చేరుతోంది. ఎలా సద్దుమణచాలని ముఖ్య నేతలు తలలు పట్టుకుంటున్నారు.

కొనసాగిన పారిశుధ్య కార్మికుల సమ్మె

సంఘీభావం తెలిపిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



పెనుకొండలో సంఘీభావం తెలుపుతున్న సవిత

పెనుకొండ/టౌన్, జనవరి 10: సమస్యల పరిష్కారం కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షల శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, సీపీఎం నాయకులు ఇంతి యాజ్ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో కూర్చున్నారు. అనంతరం ఆమె టీడీపీ నాయకులతో కలిసి కార్మికుల సమ్మె కారణంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు, నిండిన డ్రైనేజీ లను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. 14, 15వార్డుల్లో పర్యటించారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

మడకశిరటౌన్: తమను రెగ్యులర్ చేయాలని, తమ సమస్యలు పరి ష్కరించాలని మున్సిపల్ కార్మికులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. మడకశిర నగర పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.



మడకశిరలో మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కరువు

'ఆడుదాం ఆంధ్రా'లో ఇదీ పరిస్థితి



గౌడనహళ్లిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు

మడకశిర రూరల్, జనవరి 10 : మండల స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీను మండల కేంద్రమైన మడకశిరలో బుధవారం నిర్వహించాల్సి ఉంది. అయితే అక్కడ సరియైన క్రీడామైదానం లేకపోవడంతో గౌడనహళ్లి, కల్లుమర్రి, నీలకంఠాపురంలోని ఉన్నత పాఠశాలల ఆటల మైదానాల్లో నిర్వహించారు. చందకచర్ల, ఆమిదాలగొంది, అర్ అనంతపురం పంచా యతీల టీమ్‌లకు గౌడనహళ్లిలో... మెళవాయి , కదిరేపల్లి, గంగుళ వాయి పాళ్యం టీమ్‌లకు నీలకంఠాపురంలో... బుళ్ళసముద్రం, మణూరు టీమ్‌లకు కల్లుమర్రిలో క్రీడాపోటీలు నిర్వహించారు. అయితే ఆయా మైదానాల్లో ఎక్కడా క్రీడాకారులకు సరియైన తాగునీరు, భోజన వసతి, ప్రథమ చికిత్సకు వైద్యులు, గెలుపోటములపై కామెంటరీ చేయడానికి మైక్ ఏర్పాటు చేయలేదు. దీంతో చాలా మంది క్రీడాకారులు అసహనం వ్యక్తంచేశారు. తదుపరి నిర్వహించే క్రీడలకు కనీసం సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ సోనియాబాయిని వివరణ కోరగా... తగినన్ని క్యాన్లు లేకపోవడంతో క్రీడలు జరిగేచోట క్రీడాకారులకు తాగునీటి పాకెట్లను అందించినట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన నిధులు కూడా ఇంకా రాలేదన్నారు. అయినా క్రీడాకారులకు అన్నీ సౌకర్యాలు కల్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు.



క్రీడాకారులందరి కోసం ఏర్పాటుచేసిన తాగునీటి క్యాన్

'సంప్రదాయాలను కొనసాగిద్దాం'

హిందూపురం అర్బన్, జనవరి 10: సంస్కృతీసంప్రదాయాలు చాలా గొప్పవనీ, వాటిని కొనసాగిద్దామని ప్రగతి మహిళా మండలి సభ్యులు పేర్కొన్నారు. ప్రగతి మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సనాతన ధర్మం చాలా గొప్పదని ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూ స్తున్నాయన్నారు. భారత సంస్కృతి ప్రపంచదేశాలకు ఆదర్శమన్నారు. పూర్వీకులు ఏది చేసిన అందులో నిగూఢార్థం దాగి ఉంటుందన్నారు. కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలన భావితరాలు కొనసా గించాలని పిలుపు నిచ్చా రు. గంగిరెద్దులకు పూజ లు చేశారు. కార్యక్రమం లో సంఘం కార్యదర్శి రాజేశ్వరీ కుమార్, రాజ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.



ముగ్గు వేసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు

హిందూపురం అర్బన్, జనవరి 10: బహుజన సమాజ్‌వాదీ పార్టీతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పేర్కొన్నారు. లేపాక్షి మండల పరిధిలోని తిమ్మగానపల్లిలో బుధవారం విస్తృతస్థాయి సమాజ్‌వాదీ పార్టీ సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీని ముందుకు తీసుకెళ్లేలా విస్తృత ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాబోవు ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాజిమ్‌బాష, అడ్వకేట్ సత్యనందమూర్తి, ఈశ్వరయ్య, సుబ్బరాయప్ప, రాచపల్లి నరసింహమూర్తి, కొండప్ప, లక్ష్మీనరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దొంగల హల్‌చల్

మడకశిర రూరల్, జనవరి 10 : గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. కదిరేపల్లి పంచాయతీ కేంద్రంలో మంగళవారం రాత్రి తాగునీటి బోరు కేబుల్‌ను గుర్తుతెలియని దుండగులు దొంగలించుకెళ్లారు. అదే రోజు రాత్రి మెళ వాయి ఎస్సీ కాలనీలోని నాగమ్మ అనే మహిళకుకు చెందిన మేకలను దొంగలు ఎత్తుకెళ్లే సమయంలో కాలనీ వాసులు గుర్తించి కేకలు వేశారు. దీంతో దొంగలు వాటిని అక్కడే వదలి వేసి వెళ్లారు. ఈ విషయమై కదిరేపల్లి సర్పంచు నర్సేగౌడ్ మాట్లాడుతూ... పంచాయతీలో నిధులు లేవు. 20 రోజుల్లో మూడుసార్లు తాగునీటి బోరు కేబుల్‌ను దొంగలు కోసుకెళ్లారు అన్నారు. అయితే గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఉండడం కోసం తన సొంత డబ్బులతో వేయిస్తున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఎస్‌ఐ లోకేశ్ మాట్లాడుతూ... గ్రామాల్లోకి అనుమానితులు ఎవరైనా వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిజాయితీకి ల్యాండ్‌మార్క్ చంద్రబాబు : సవిత



అన్నక్యాంటీన్ వద్ద సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జనవరి 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు నీతి నిజాయితీకి ల్యాండ్‌మార్క్ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. చంద్రబాబుపై ప్రభుత్వం పెట్టిన పలు కేసులకు సంబంధించి బుధవారం ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో ఆమె టీడీపీ స్థానిక నాయకులతో కలిసి స్థానిక అన్నక్యాంటిన్ వద్ద స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఎలాగైనా ప్రజల్లో చంద్రబాబుకు అవినీతి మరక అంటించాలని అధికార వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలో ఐఆర్‌ఆర్, ఇసుక, మద్యం కేసుల్లో ముందస్తు బెయిల్ రావడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు. 2024లో వైసీపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పనున్నారన్నారు.

పొర్లుదండాలతో అంగన్‌వాడీల నిరసన



గోరంట్లలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గోరంట్ల, జనవరి 10: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు పొర్లుదండాలతో చేతులెత్తి నమస్కరిస్తూ బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన దీక్షల శిబిరం వద్దకు సీపీఎం నాయకులు ఇంతియాజ్, పెద్దన్న, వచ్చి మద్దతు ప్రకటించారు.

రేపు డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

మడకశిరటౌన్, జనవరి 10: పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మె గా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బయ్య బుధవారం తెలిపారు. డిగ్రీ కళాశాల ఆవరణంలో దాదాపు 13 కంపెనీలు పాల్గొని జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపా రు. 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. పెనుకొండ కియ కంపెనీతోపాటు బెంగళూరుకు చెందిన పలుకంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యుంతో కలిసి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు

అగళి, జనవరి 10 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్డీటీ భవనంలో 150మందికి బుధవారం కంటి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. బెంగళూరు బనశంకరి ఆసుపత్రి వైద్యుల చేత ఈ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 50మందిని కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. త్వరలోనే వారిని కంటి ఆపరేషన్లకు పంపుతారన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న మరో 70మందికి జడ్పీటీసీ ఉమేష్ చేతుల మీదుగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ రంగనాథ్, దినేష్, మూర్తి, ఐటీడీపీ పుట్టప్ప, కార్తీక్, జయన్న తదితరులు ఉన్నారు.

రోడ్డును బాగు చేయరూ..



కంకర తేలిన పీఎస్ పాళ్యం రోడ్డు

గుడిబండ, జనవరి 10 : మండలంలోని పీఎస్ పాళ్యం గ్రామానికి వెళ్లే కంకర రోడ్డును బాగు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామస్థులు రంగధామప్ప, కిష్టప్ప, రాజన్న, రంగప్ప, శశిధర్, మంజునాథ్, బీమణ్ణ, ఆనందప్ప, ఈరనాగప్ప, సోమన్న తదితరులు బుధవారం మాట్లాడుతూ... గుడిబండ నుంచి పీఎస్ పాళ్యానికి వెళ్లే రహదారి కంకరతేలి ప్రయాణానికి కష్టతరంగా మారిందన్నారు. ఆ రోడ్డులో ప్రయాణించడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గుడిబండ నుంచి పీఎస్ పాళ్యం, కురుబరపల్లి, వడ్డరహట్టి, ఎంఎస్ తండా గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మార్గానే వెళ్లాల్సి ఉందన్నారు. చాలా ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని కంకరతేలిన రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.